


రంజాన్ వేళలు

	ఇఫ్తార్(శనివారం)	సెహరీ(ఆదివారం)
కర్నూలు	6:33 (సాయంత్రం)	5:02 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:30 (సాయంత్రం)	5:15 (ఉదయం)
ఆదోని	6:35 (సాయంత్రం)	5:05 (ఉదయం)





● రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్న మాఫియా ● ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు కేంద్రాలుగా బియ్యం సేకరణ ● పాలిష్ చేసి బ్రాండ్ పేరుతో పక్క రాష్ట్రాలకు రవాణా ● పట్టించుకోని రెవెన్యూ అధికారులు

బియ్యం బకాసురులు

పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న బియ్యం పెద్దలకు పరమాన్నంగా మారుతున్నాయి. పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ దుకాణాలకు చేరకుండానే చేరినట్లు లెక్కలు చూపుతూ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లు, డీలర్ల నుంచే నేరుగా ప్రభుత్వ సంచుల్లోనే వ్యాపారులకు చేరవేస్తున్నారంటే ఎంతకు తెగించారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. రాయితీ బియ్యాన్ని పాలిష్ పట్టి పక్క రాష్ట్రాలకు తరలించి ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండ, అధికారుల ఆశీస్సులతో యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. రేషన్ అక్రమాలను అరికట్టాల్సిన సివిల్ సప్లైస్, రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఆదోని, మార్చి 15: పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం... డీలర్ల నుంచి దళారులు, మిల్లర్లు, వ్యాపారుల జేబులు నింపుతోంది. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ ఏటా కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. ప్రజలకు చేరాల్సిన బియ్యం దొడ్డిదారిలో మిల్లులకు చేర్చి, అక్కడ పాలిష్ పట్టించి, వివిధ రకాల బ్రాండ్ల పేరుతో మార్కెట్లో విక్రయిస్తున్నారు. అధికార యంత్రాంగ సహకారంతో జరుగుతున్న ఈ అక్రమ దందా ఆదోని అధికార పార్టీకి చెందిన 'చిన్నబాస్' కనుసన్నల్లోనే జరుగుతోంది.



పేదల బియ్యం పెద్దల జేబుల్లోకి..

ప్రతి ఇంటికి నేరుగా బియ్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. దీంతో ఆదోనిలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు యూనియన్‌గా ఏర్పడి ఈ అక్రమ దందా ఆధ్వర్యంలోనే, ఆదోని కేంద్రంగా ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దున ఉన్న ఓ మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి యథేచ్ఛగా కర్ణాటకకు తరలిస్తున్నారు. గతంలో ఈ మిల్లు యజమాని జిల్లా అధికారుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. అధికార పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ చిన్నబాస్‌గా చెలామణి అవుతున్న యువనేత ఆ మిల్లు యజమానికి అండగా నిలబడ్డాడు. మిల్లుతో పాటు యజమానిపై ఎలాంటి కేసు లేకుండా చూసుకుని అధికార దర్పాన్ని ప్రదర్శించాడు. ఆదోని పట్టణంలోని మరో రైస్ మిల్లులో కూడా రేషన్ బియ్యం పాలీషింగ్ జరుగుతోంది. మిల్లర్లు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, వాటిని రీసైక్లింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

వ్యాపారంగా మారిన దందా

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొందరు రేషన్ బియ్యం దందాను ఒక వ్యాపారంగా మార్చుకున్నారు. లబ్ధిదారుల నుంచి ఉచిత బియ్యం సేకరణకు అక్రమార్కులు గ్రామాల్లో ఏకంగా ఏజెంట్లనే నియమించుకుంటున్నారు. సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వచేసి అదనుచూసి పోలీసులు, పౌరసరఫరాల అధికారుల కళ్లు కప్పి లారీలు, వ్యాన్లలో తరలిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో మన బియ్యానికి మంచి డిమాండ్ ఉంది. రూ.18 నుంచి రూ.25 వరకు ధర పలుకుతోంది. ఉమ్మడి జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో రేషన్‌కార్డుదారుల నుంచి కిలోకు రూ.8కు కొని లారీలకు లారీలు, రాత్రికి రాత్రే సరిహద్దులు దాటిస్తున్నారు. ఒక లారీ లోడు బియ్యాన్ని ఆవతల వైపు దాటిస్తే రూ.3 లక్షలు వచ్చినట్లే. పెద్ద మొత్తంలో జేబులు నిండుతుండడంతో వారు దీనిని బంగారు గుడ్లు పెట్టే బాతులా భావిస్తున్నారు.

సెక్షన్ 6ఏ కింద కేసులు

రూ.కోట్లు గడిస్తున్న అక్రమార్కులు కేసులకు కూడా భయపడటం లేదు. చౌక బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు 6ఏ కేసులు పెడుతున్నా పెద్దగా ప్రయోజనం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం కనిపిస్తోంది. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న అధికారులు, టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిపై అత్యవసర సరుకుల చట్టం 1955లోని 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఈ సెక్షన్ కింది శిక్షలు స్వల్పంగా ఉండడంతో యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు వందల క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బియ్యం భారీ మొత్తంలో ఉంటే పౌరసరఫరాల గోదాముకు, తక్కువ మొత్తంలో ఉంటే సమీపంలోని రేషన్ దుకాణాలకు అప్పగించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను న్యాయస్థానాలకు అప్పగిస్తారు.

శిక్షలు ఇలా....

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులపై అత్యవసర సరుకుల చట్టంలోని 6ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తున్నారు. చట్టంలో ఈ సెక్షన్ కింద అక్రమార్కులపై జరిమానా, శిక్షలను నిర్దేశిస్తోంది. మొదటిసారి అక్రమంగా సరుకులు తరలిస్తే వారికి మూడు నెలల నుంచి ఏడేళ్ల వరకు శిక్ష విధించే అవకాశం ఉంది. జైలు శిక్షతో పాటు జరిమానా విధించవచ్చు. రెండోసారి పట్టుబడితే ఆరు నెలల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించడంతో పాటు జరిమానా విధించవచ్చు. అక్రమ వ్యాపారానికి అవకాశం కల్పించిన, ప్రేరేపించినా శిక్షించే అవకాశం ఉంది. పట్టుబడిన సరుకును సక్రమమే అంటూ లెక్కలు చేపించే ప్రయత్నం చేసిన వారికి సైతం శిక్ష ఉంటుంది. రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినా, కస్టమ్ రైస్‌కు తరలించినట్లు రుజువైన పక్షంలో ఐదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

కేసులు నమోదు చేస్తాం

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి రైస్ మిల్లులో బియ్యం పాలిష్ చేస్తున్నట్లు మాకు కొంత సమాచారం ఉంది. సబంధిత రైస్ మిల్లు పై నిఘా పెట్టాం. పోలీసుల సహాయంతో దాడులు చేసి, సంబంధిత వ్యక్తుల పై కేసులు నమోదు చేస్తామని తెలిపారు

- ఏఎం ప్రసాద్ రాజు, తహసీల్దారు, హొళగుంద

● ఈ-పాస్ మిషన్ల వచ్చినా...

ప్రభుత్వం ఈ పాస్ మిషన్లను తీసుకవచ్చినా అక్రమ దందా ఆగడం లేదు. పట్టణాలు, గ్రామల్లో కొన్ని వర్గాల వారు రేషన్ బియ్యాన్ని వినియోగదారుల నుంచి రూ.8 నుంచి రూ.12లు వరకు కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని వాళ్ల మధ్య దళారులకు రూ.25 రూపాయలకు కిలో చొప్పున విక్రయిస్తుండటంతో వాళ్ల సిరుగుప్ప, హొళగుంద మీదుగా కర్ణాటక రాష్ట్రంలోకి తరలిస్తున్నారు. అక్కడ రూ.25 నుంచి రూ.28 రూపాయలకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ బియ్యం కొనుగోళ్ల దందా కొనసాగుతోంది. రేషన్ డీలర్లు వినియోగదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని 15వ తేదీ తర్వాత ఒకేసారి రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. లేదంటే ఆ బియ్యాన్ని షాపులోనే ఉంచి మరుసటి నెలలో గోదాం నుంచి వచ్చే వాహనాలు ద్వారానే తరలిస్తున్నారని సమాచారం. ఆ లోటును మిల్లర్లు రేషన్ బియ్యంతో భర్తీ చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ప్రతినెలా 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపుల్లో బియ్యం ఇచ్చే సమయంలో తనిఖీ చేస్తే రేషన్ డీలర్ల బండారం బయటపడుతుంది. ఆ షాపునకు ఎంత కోటా ఇచ్చారు, ఎంత పంపిణీ చేశారు, ఎంత స్టాకు ఉంది.. అనే వివరాలు ఆరా తీస్తే మిగులు బియ్యం దొరుకుతాయి. అయితే సివిల్ సప్లైస్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తప్ప ఆ షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదు.

పొత్తును గౌరవించాలి!

● బీజేపీ అధిష్టానంతో మరోసారి చర్చిస్తాను
● ఆ పార్టీ దిగివస్తే ఆలోచిస్తాను
● టికెట్‌పై మీనాక్షినాయుడికి భరోసా
● టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన మీనాక్షినాయుడు




టీడీపీ అధినేత చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు

కర్నూలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నాం. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పొత్తు ధర్మాన్ని సీనియర్ నాయకులు గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోసారి బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో చర్చిస్తాను.. ఏ అవకాశం ఉన్నా ఆదోని టికెట్‌పై మీకే' అని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు సమాచారం. శుక్రవారం ఉండవల్లిలో ఉన్న స్వగృహంలో అధినేత చంద్రబాబును మీనాక్షినాయుడు కలిశారు. ఆదోని టికెట్ ఏ కారణాలు చేత బీజేపీకి ఇవ్వాల్సి వచ్చిందో చంద్రబాబు మీనాక్షినాయుడుకి తెలిపారు. అదే సమయంలో ఆదోని నియోజకవర్గంలో 2.57 లక్షల ఓట్లు ఉన్నాయని, అందులో ముస్లిం మైనార్టీ ఓటర్లు కీలకమని, ఇక్కడ బీజేపీ బలాబలాలు, ఆ ప్రభావం పార్లమెంట్ స్థానం అభ్యర్థిపై కూడా పడే అవకాశం ఉందని.. తదితర వివరాలు అధినేత చంద్రబాబు దృష్టికి మీనాక్షినాయుడు తీసుకెళ్లినట్లు తెలిసింది. పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేల్లో ఆదోనిలో టీడీపీ గెలుస్తుందనే ఉంది.. ఈ టికెట్ కోసం బీజేపీ ఎందుకు అంతలా పట్టుబడుతుందో అర్థం కావడం లేదు.. పొత్తు ధర్మంలో భాగంగా చివరి క్షణంలో ఒప్పుకోక తప్పలేదని చంద్రబాబు పేర్కొన్నట్లు తెలిసింది. మరోసారి బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో చర్చిస్తానని, వాళ్లు ఒప్పుకుంటే మీ అభ్యర్థిత్వం ఖరారు చేస్తామంటూ టికెట్‌పై భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆదోని టికెట్ కోసం బీజేపీ అంతలా పట్టుబట్టడం వెనుక కారణాలు ఏమిటి..? అనే చర్చ జరుగుతోంది. టీడీపీ ఆవిర్భావం 1983 నుంచి కొనసాగుతున్న కె.మీనాక్షినాయుడు ఆదోని నుంచి ఆరు పర్యాయాలు పోటీ చేస్తే మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జిల్లా టీడీపీలో అత్యంత సీనియర్ నాయకుడు. ఈ ఎన్నికల్లో పోటీ చేసి చివరిగా తన అదృష్టాన్ని మరోసారి పరీక్షించుకోవాలని అనుకున్నారు. టికెట్ తనకే వస్తుందని చివరి వరకు ధీమాగా ఉన్నా.. పొత్తు రూపంలో బీజేపీ ఖాతాలో జమ కావడంతో ఆయన వర్గీయులు నిరుత్సాహంతో ఉన్నారు. అయితే.. అధినేత చంద్రబాబును కలవడం, మరోసారి బీజేపీ అధిష్టానంతో చర్చిస్తానని ఆయన చెప్పడంతో మీనాక్షినాయుడు, ఆయన వర్గీయుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అలాగే.. టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు నేడు యువనేత నారా లోకేశ్‌ను కలిసే అవకాశం ఉంది.

గ్రూప్-1 పరీక్షల అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 15: జిల్లాలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డా.జి. సృజన తెలిపారు. జిల్లా కేంద్రంలోని 31 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలు ఉంటాయని తెలిపారు. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌లో 8498031434 (వెంకటేశ్), 8142460214 (శ్రీనివాసులు) గ్రీవెన్స్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్, ల్యాండ్‌లైన్ 08518-277305 అందుబాటులో ఉంటారన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



శ్రీశైలం, మార్చి 15: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం రోజున భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్విక బలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాదికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

వైభవంగా ఊయలసేవ

శ్రీశైలం మహా క్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి పూజ చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులను సమర్పించారు. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది.

కర్నూలు డీఎంహెచ్‌వోగా డా.వై.ప్రవీణ్ కుమార్



కర్నూలు (హాస్పిటల్), మార్చి 15: కర్నూలు డీఎంహెచ్‌వోగా డా.వై.ప్రవీణ్ కుమార్ నియమితులయ్యా రు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డా.బి.రామగిడ్డ య్యను విశాఖపట్నం రీజనల్ డైరెక్టరుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన్ను రిలీవ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ జనవరి 18వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డర్స్ రావడంతో డా.బి.రామగిడ్డయ్య రిలీవ్ అయ్యారు. దీంతో కర్నూలు డీఎంహెచ్‌వో (ఎఫ్ఏసీ)గా డా.ప్రవీణ్ కుమార్ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. డా.ప్రవీణ్ కుమార్ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పని చేస్తున్న ఆయనకు డీఎంహెచ్‌వో (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ డైరెక్టర్ హెల్త్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఈయన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంవోగా 20 ఏళ్ల పని చేశారు.

పదో తరగతి పరీక్షలకు ఎన్నికల సెగ

● ఎండకు తోడు ఎన్నికల జోరు ● జిల్లాలో 37,801 మంది విద్యార్థులు.. 162 పరీక్ష కేంద్రాలు ● ఏర్పాట్లలో నిమగ్నమైన విద్యాశాఖ అధికారులు



కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 15: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఎండలకుతోడు ఎన్నికల సెగ తాకనుంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే విద్యుత్ కోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎన్నికల ప్రచార హోరు వల్ల పదో తరగతి పరీక్షలకు అసౌకర్యం అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. కర్నూలు జిల్లాలో 489 ఉన్నత పాఠశాలల నుంచి 37,801 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 31,178 మంది కాగా, ప్రైవేటుగా 6,623 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 162 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదోని డివిజన్‌లో 19,362 మంది ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 16,224 మంది కాగా, ప్రైవేటుగా 3138 మంది హాజరవుతున్నారు. మొత్తం 84 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. అలాగే కర్నూలు డివిజన్‌లో 18,439 మంది విద్యార్థులు ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 14,954 మంది కాగా, ప్రైవేటుగా 3485 మంది ఉన్నారు. 78 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 84 ఏ-కేటగిరి కేంద్రాలను, 61 బీ-కేటగిరి కేంద్రాలను, 17 సీ-కేటగిరి పరీక్ష కేంద్రాలను గుర్తించారు. జిల్లాను మొత్తం 44 జోన్లుగా విభజించారు. జిల్లాలో 8 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి 6 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షల నిర్వహణకు 162 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 162 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో పాటు 1890 మందిని పరీక్ష కేంద్రాలకు ఇన్విజిలేటర్లుగా కేటాయించారు. ఇప్పటికే ఆదోని, కర్నూలు డివిజన్ స్థాయిలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ల ఆఫీసర్లకు పరీక్షలపై వర్క్‌షాపు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా 7 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి పరీక్ష ప్రశ్నపత్రాలను సరఫరా చేసి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పది పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణం

కర్నూలు(రూరల్)మార్చి15: ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు పాస్ లేనప్పటికీ తమ ఒరిజనల్ హాల్ టికెట్‌ను బస్సు కండక్టర్‌కు చూపిస్తే చాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పల్లె వెలుగు (ఆర్డీనరి), అల్ట్రాపల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతి ఉంటుందన్నారు.

పంట ఉత్పత్తుల ధరలు ఢమాల్

కన్నీటి పర్యంతమవుతున్నరైతులు



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 15: కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ పంట ఉత్పత్తుల ధరలు గత వారంతో పోలిస్తే.. తగ్గిపోతుం డటంపై రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వేరుశనగ కాయలు కర్నూలు మార్కెట్ యార్డులో శుక్రవారం గరిష్ఠ ధర రూ.6,999కు తగ్గిపోయింది. మధ్యస్థ ధర రూ.6,009, కనిష్ఠ ధర రూ.3,636కు తగ్గిపోవడం పై రైతులు లబోదిబో మంటున్నారు. పూల విత్తనాల ధరలు కూడా పతనం అవుతున్నాయి. గరిష్ఠ ధర, మధ్యస్థ, కనిష్ఠ ధరలు కూడా రూ.1,210 పలికాయి. వాము ధర గత వారంతో పోలిస్తే రూ.3వేలకు పడిపోయింది. గరిష్ఠ ధర రూ.29,010, మధ్యస్థ ధర రూ.22,199, కనిష్ఠ ధర రూ.2,006కు తగ్గిపోయింది. మొక్కజొన్న లకు గరిష్ఠ ధర రూ.2,111, మధ్యస్థ ధర రూ.1,959, కనిష్ఠ ధర రూ.1,300కు తగ్గిపోయింది. కందులకు గరిష్ఠ ధర రూ.9,869, మధ్యస్థ ధర రూ.1,959, కనిష్ఠ ధర రూ1,300కు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగలకు క్వింటానికి గరిష్ఠ ధర రూ.5,749, మధ్యస్థ ధర రూ.5,709, కనిష్ఠ ధర రూ.3,069కు చేరింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.1,459, మధ్యస్థ ధర రూ.1,381, కనిష్ఠ ధర ఘోరంగా రూ.297కు దిగజారడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటు న్నారు. ఎండుమిర్చి గరిష్ఠ ధర రూ.17,009, మధ్యస్థ ధర రూ.13,007, కనిష్ఠ ధర రూ.1,899కు పడిపోయింది. మినుములకు గరిష్ఠ ధర రూ.8,089, మధ్యస్థ ధర రూ.9,069, కనిష్ఠ ధర రూ.8,205కు తగ్గిపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు.

21 నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



మద్దికెర, మార్చి 15: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు తెలిపారు. 21వ తేదీ ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు, కలశస్థాపన, అంకురార్పణ, 22న శుక్రవారం సింహోత్సవం, 23న శనివారం శేషోత్సవం 24న లంకోత్సవం, 25న గరుడోత్సవం, 26న మంగళవారం గజోత్సవం, 27న తెల్లవారుజామున చిత్తా నక్షత్రంలో రంగనాథ స్వామి భూదేవి శ్రీదేవి కళ్యాణోత్సవం అనంతరం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అదే రోజు ఉదయం 9 గంటలకు రథం ముందు హోమం నిర్వహిస్తారు. కళ్యాణోత్సవానికి గ్రామానికి చెందిన పారా రామన్న కుమారులు పారా రామచంద్రప్రసాద్, పారా చిట్టెన్న స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తారు. అదే రోజు సాయంత్రం అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా రంగనాథ స్వామి రథోత్సవం ఉంటుంది. 28న అశ్వవాహనం, 29న హంసవాహనం, 30న పార్థుసేవ ఉంటాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం: ఈవో చంద్రశేఖర్ రెడ్డి

రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుంది.

ముగిసిన వాహనాల వేలం

రూ.3,19,662 ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న సెబ్ అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్

ఎమ్మిగనూరుటౌన్/రూరల్, మార్చి15: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలను శుక్రవారం సెబ్ అధికారులు స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో వేలం పాటలు నిర్వహించారు. సెబ్ అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సెబ్ సీఐ భార్గవరెడ్డి వేలం పాటలను నిర్వహించగా 20 మంది పాటదారులు వేలం పాటలో పాల్గొన్నారు. ఒక ఆటో, 15 ద్విచక్ర వాహనాలకు వేలం పాట పాడారు. జీఎస్టీతో కలుపుకొని మొత్తం రూ.3,19,662 ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన అక్రమ మద్యం ధ్వంసం: ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్ పరిధిలో ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తు పట్టుబడిన మద్యాన్ని శుక్రవారం మండలపరిధిలోని వెంకటగిరి రోడ్డులో ధ్వంసం చేశారు. సెబ్ అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో 531లీటర్ల మద్యం, 5902 టెట్రాపాకెట్లను రోడ్డుపై వేసి వాహనంతో ధ్వంసం చేశారు. ఈ మద్యం విలువ రూ. 2,36,000 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ భార్గవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 15: బ్యాంకుల ద్వారా ఎటువంటి అనుమానాస్పద లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.జి. సృజన బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకుల ద్వారా నగదు లావాదేవీలు, పోస్టల్ కార్డులు డిస్పాచ్‌పై బ్యాంకర్లు, పోస్టల్ సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల వ్యయ నిర్వహణ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు అమలులోకి వస్తాయని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, డీఆర్వో మధుసూదన్‌రావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీసీవో రామాంజనేయులు, బ్యాంకర్లు, పోస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 855 మంది విద్యార్థులు గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 15: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం శుక్రవారం జరిగిన పరీక్షకు 855 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,294 మంది ఉన్నారని అన్నారు. వీరిలో 19,439 మంది పరీక్షకు హాజరు కాగా, 855 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారయ్యారని తెలిపారు. మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆర్‌ఐవో తెలిపారు. పరీక్ష కేంద్రాలను కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సౌరవ్‌గౌరు, కడప ఆర్జేడీ రవినాయక్, ఆర్‌ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్‌పాషా, డీఈసీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

పూర్తయిన పరీక్షలు: ఇంటర్మీడియట్ మెయిన్ పరీక్షలు పూర్తయ్యాయి. మైనర్ మీడియా పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయి. పరీక్షలు ప్రశాంతంగా జరగడంపై ఇంటర్ బోర్డు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఆనందంతో గంతులేస్తూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

రైతులూ.. ఆందోళన వద్దు

- ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా బ్యాంకు ఖాతాల్లో జమ
- జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 15: కర్నూలు జిల్లాలోని 24 మండలాల్లో జరిగిన పంట నష్టానికి రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.460.47 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని సీఎం జగన్మోహన్ రెడ్డి జమ చేశారని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం కింద ఇటీవల విడుదలైన రూ.4వేల మొత్తం కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని అన్నారు.

ముగ్గురు పోలీసులపై వేటు

విధుల్లో అలసత్వం వహించారని సస్పెన్షన్

కర్నూలు, మార్చి 15: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విధి నిర్వహణపట్ల అలసత్వం వహించిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ డీఐజీ విజయరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవుకు పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ నందునాయక్‌లను సస్పెండ్ చేశారు. ఇటీవల ఓ మహిళ అవుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భర్త శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. అప్పుడు విధుల్లో ఉన్న సుబ్రహ్మణ్యం, నందునాయక్ ఆమెను స్టేషన్ నుంచి పంపించేశారు. భర్తను స్టేషన్‌ను పిలిపించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత మరుసటి రోజే భర్త చేతిలో ఆ మహిళ దారుణ హత్యకు గురైంది. విధుల్లో ఉన్న ఆ ఇద్దరు పోలీసుల నిర్లక్ష్యం వల్లే మహిళ హత్యకు గురైందని భావించి డీఐజీ వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్‌నగర్‌లో ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఏఎస్‌ఐ అయిన ఆమె మామ తిరుపాల్ నాయక్ ఆమెను అదనపు కట్నం కోసం వేధించేవాడని బంధువులు ఆరోపించి ధర్నా చేశారు. కోడలు మృతి విషయంలో తిరుపాల్ నాయక్‌పై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయనను కూడా సస్పెండ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్నాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, మార్చి 15: కర్ణాటక రాష్ట్ర రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ దినేష్ కుమార్ శుక్రవారం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈయనకు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. ఆయన గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎస్‌ఐ గోపీనాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్ ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవరాయడికి విశేష పుష్పాలంకరణ

- రథాలపై ఊరేగిన ప్రహ్లాదరాయలు
- అలరించిన భరతనాట్యం



మంత్రాలయం, మార్చి 15: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం రాఘవేంద్ర స్వామి బృందావనానికి ఘనంగా విశేష పుష్పాలంకరణ చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవరాయలకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరా యలకు చెక్క, వెండి, బంగారు, గజవాహనం, నవరత్నాల రథాలపై ఊరేగించారు. అనంతరం నిర్వహించిన ఊంజల సేవ చేశారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాజాఎస్ గిరిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, వాదిరాజాచార్, డీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం

గురు వైభవోత్సవాల్లో భాగంగా 5వ రోజు యోగీంద్ర కళామండపంలో శుక్రవారం రాత్రి బెంగుళూరుకు చెందిన హాసికచే భరతనాట్యం కార్యక్రమం ఏర్పాటు చేశారు. తమిళనాడులోని సేలం చెందిన మెత్యూరు బ్రదర్స్ శాస్త్రీయ సంగీత కచేరీ చేశారు. ఈ కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నేడు రాఘవేంద్రస్వామి 429 జయంతి వేడుకలు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి 429వ జన్మదిన వేడుకలు శనివారం వైభవంగా జరగనున్నాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంస్థాన పూజలు జరగనున్నాయి. తమిళనాడుకు చెందిన రాఘవేంద్రస్వామి నాదాహార సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 500 మంది సంగీత విద్వాంసులచే నాదాహార సమర్పణ సేవ నిర్వహించనున్నారు. టీటీడీ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనుంది.

విద్యా రంగంలో బీసీడీఈ విప్లవాలను తెస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి

అవగాహన సదస్సులో వీసీ

కర్నూలు(అర్బన్), మార్చి 15: ఉన్నత విద్యలో ప్రవేశపెట్టిన బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చేస్తుందని ఉపకులపతి బీ సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ సెనేట్ హాలులో ఒక్క రోజు అవగాహన సదస్సులో ఉమ్మడి జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులలో సామాజిక బాధ్యతను మేల్కొలిపేలా, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో నిర్ధారిత అంశాల్లో పురోగతి సాధించేలా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని అన్నారు. బీసీడీఈ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రొఫెసర్ ఎంఎల్ ఎస్ దేవకుమార్ మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టులో పాల్గొనడం ద్వారా ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులలో సామాజిక అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో రెకాక్టర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ అంకన్న, యూనిసెఫ్ కన్సల్టెంట్ వి. స్వాతిదేవి, శిక్షణా ఫౌండేషన్ ఆపరేషనల్ మేనేజర్ అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ అసమ్మతి నేతలతో గోరంట్ల మాధవ్ మంతనాలు

పత్తికొండ ఎమ్మెల్యే టికెట్‌పై మళ్లీ జోరందుకున్న చర్చలు



వైసీపీనాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

పత్తికొండ , మార్చి 15 : హిందూపురం ఎంపీ గోరంట్లమాదవ్ స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవితో పాటు పత్తికొండ ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉన్న పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డితోపాటు నాగరత్నమ్మ కుటుం బాలతో వేర్వేరుగా మంతనాలు చేశారు. శుక్రవారం పత్తికొండకు వచ్చిన గోరంట్ల ముందుగా పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డిని ఆయన ఇంట్లో కలసి అరగంటపాటు మాట్లాడారు. అనంతరం సాయి దేవాయలయంలో రామచంద్రారెడ్డిని కలసి మాట్లాడారు. పత్తికొండ ఎమ్మెల్యే టికెట్ కోసం శ్రీదేవితోపాటు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, మాజీమంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి కుమార్తె ఎస్ నాగరత్నమ్మ పోటీలో ఉన్న విషయం తెలిసిందే. ముగ్గురి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ముఖ్యమంత్రి మాట్లాడినా ఎవరికి వారు తమకే టికెట్ కావాలని ఆయనకు విన్నవించుకున్నారు. దీంతో టికెట్ విషయం పెండింగ్‌లో ఉండిపోయింది. దీనికితోడు కురువ సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న పత్తికొండ నియోజకవర్గం నుండి పోటీ చేయాలని గతంలో హిందూపురం ఎంపీ గోరంట్లమాదవ్ ఆ సామాజికవర్గం నిర్వహించిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పత్తికొండ తిరునా ళ్లకు సైతం హాజరయ్యారు. తన నియోజకవర్గంలో ఆయన చేస్తున్న కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవి అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానానికి అప్పట్లో ఫిర్యాదు చేసినట్లు పార్టీవర్గాల భోగట్టా. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే అసమ్మతి వర్గాన్ని ఆయన కలిసి మాట్లాడడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కాగా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తానని పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్



హెల్త్ అసిస్టెంట్‌కు ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను అందజేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హస్పిటల్), మార్చి 15: ఉమ్మడి జిల్లాలో 136 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేస్తూ కర్నూలు డీఎంహెచ్‌వో బి. రామగిడ్డయ్య శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను అందజేశారు. ఈ నెల 9న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు జారీ చేసిన ఆఫీస్ ప్రొసీడింగ్స్ స్థానంలో ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను జారీ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణింపబడుతారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 136 మంది ఉద్యోగులకు 85 మంది మేల్ హెల్త్ అసిస్టెంట్లు, 46 మంది ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్లు, ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లకు కొత్తగా ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో నాగప్రసాద్, సెక్షన్ క్లర్క్ మురళి బ్రహ్మేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్లు గిరిధర్, మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్లు రమేష్ ఆచారి పాల్గొన్నారు.

ప్రముఖులకు అవార్డులు



పండితులకు అవార్డులు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 15: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అవార్డులు ప్రదానం చేశారు. విద్వాన్ విరుపాక్షం, విజయవాడ రుగ్వేద పారాయణకర్త వేద పండితులు విరుపాక్ష శైవాక్ష మహర్షి, టీటీడీ ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ అండ్ ఆర్గనైజర్ విద్వాన్ అఖేల్ల విభీషణ శర్మ, బెంగుళూరు చెందిన మధుమేహం వైద్యనిపుణుడు డా. సంజయ్ అనంతక్రిష్ణ, న్యూఢిల్లీ మధ్వసాంగ ప్రెసిడెంట్ డా. మధుసూదన్‌రావు, ముంబైకి చెందిన సామాజిక సేవాకర్త అరుణాచార్య, బెంగుళూరు సామాజిక సేవాకర్త సురేష్ కుమార్, బెంగుళూరు చెందిన పరిమళ గిలియేరా బాలాగా జయసింహలకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రశంసాపత్రం, మెమెంటో, వెండి గిన్నె, రాఘవేంద్రస్వామి మెమెంటో, నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

లారీ, ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు దుర్మరణం



ప్రమాదంలో ఢీకొట్టిన లారీ, ట్రాక్టర్లు

మంత్రాలయం, మార్చి 15: మంత్రాలయం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మహారాష్ట్రకు చెందిన లారీ, మంత్రాలయం చెందిన ట్రాక్టరు ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రోడ్డు ప్రమాదం శుక్రవారం రాత్రి జరిగింది. మంత్రాలయం ఎస్‌ఐ గోపీనాథ్ వివరాల మేరకు.. మంత్రాలయానికి చెందిన బడేసాహెబ్ ట్రాక్టర్‌కు డీజిల్ వేయించుకుని వస్తుండగా మంత్రాలయం నుంచి మాధవరం వైపు వెళ్తున్న మహారాష్ట్ర చెందిన లారీ ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ తెలుగు బడేసాబ్ (35), మహారాష్ట్రకు చెందిన సంపత్ సాహెబ్‌రావు (42) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్‌ఐ గోపీనాథ్, ఏఎస్‌ఐ ఆనందరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కోదండరామిరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డుపైనే రెండు వాహనాలు ఢీకొనడంతో ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో రెండు వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలు సాగించారు. లారీలో ఉన్న క్లీనర్ పరారయ్యాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మాసిస్టులు ఇకపై ఫార్మసీ ఆఫీసర్లు



ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసిన ఫార్మసీ ఆఫీసర్లు

కర్నూలు(హస్పిటల్), మార్చి 15: వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఫార్మాసిస్టులుగా పని చేస్తున్న ఉద్యోగులను ఫార్మసీ ఆఫీసర్లుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్-2 ఫార్మాసిస్టును ఫార్మాసీ ఆఫీసర్‌గా గ్రేడ్-1 ఫార్మాసిస్టును సీనియర్ ఫార్మసి ఆఫీసర్‌గా, గెజిటెడ్ హోదాతో పని చేస్తున్న ఫార్మాసి సూపర్‌వైజర్‌ను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్లుగా పేరు మార్పు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులను శుక్రవారం ఉదయం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి.వెంకట రంగారెడ్డికి ఏపీ ఫార్మాసిస్టు అసోసియేషన్ జిల్లా కమిటీ అందజేసింది. ఈ పేరును మార్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ బి.నరసింహారావు, ఏపీ ఫార్మసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, రాజేష్ నాయక్, బి.కృష్ణమోహన్ శర్మ, శ్రీనివాస్, వెంకటేశ్, దీప్తి, ఫార్మసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో జగన్ పాలనకు చరమ గీతం

కూటమి గెలుపు తథ్యం: బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), మార్చి 15: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు జగన్ పాలనకు చరమగీతం పాడబోతున్నారని ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపి కూటమి గెలుపు ఖాయమని తెలిసి జగన్‌రెడ్డి భయంతో వణికిపోతున్నారని తెలిపారు. జగన్ రెడ్డి పాలనలో అక్రమ, అవినీతి పాలన ముగింపు దశకు చేరుకుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో జగన్‌రెడ్డిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

పొగాకు పంటను దహనం చేసిన దుండగలు

- బాధిత రైతు టీడీపీ మండల కన్వీనర్



కాలిపోయిన పొగాకు పంటను పరిశీలిస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్)మార్చి15: కర్నూలు రూరల్ మండలం టీడీపీ కన్వీనర్ బోయ శివశంకర్‌నాయుడుకు చెందిన చేతికి వచ్చిన పొగాకు పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. రేమట గ్రామానికి చెందిన శివశంకర్ నాయుడు దాదాపు మూడెకరాల్లో పొగాకు పంటను వేశారు. పంట కాలం పూర్తి అయిన తర్వాత పొగాకు ఆకులను తెంపి పొలంలోనే తోరణాలు కట్టి ఎండబెట్టారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పొలంలోకి వెళ్ళి పొగాకు తోరణాలకు నిప్పుపెట్టారు. శుక్రవారం ఉదయం శివశంకర్‌నాయుడు సోదరులు పొలానికి వెళ్ళి చూడగా ఒక వైపు కట్టిన పొగాకు తోరణం పూర్తిగా కాలిపోయింది. దాదాపు 8క్వింటాళ్ల పొగాకు కాలి రూ. 7లక్షలు నష్టం సంభవించినట్లు శివశంకర్ నాయుడు తెలిపారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్, తదితరులు వెళ్లి పొలానికి వెళ్లి పరిశీలించారు. పార్టీ దృష్టికి తీసుకెళ్ళి శివశంకర్ నాయుడుకి న్యాయం జరిగే విధంగా చూస్తామని ఆకెపోగు ప్రభాకర్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

- ఇద్దరి అరెస్టు, బైక్ సీజ్



అక్రమ మద్యం చూపుతున్న సెబ్ అధికారులు

పత్తికొండ, మార్చి 15: ఇతర రాష్ట్రాల నుంచి పత్తికొండ ప్రాంతానికి అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 20 ఫుల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంటు అడిషనల్ కమిషనర్ వినోద్ కుమార్, సెబ్ సీఐ సువర్ణలత తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ మండలం హోసూరు వైపు నుంచి మోటారు సైకిల్‌పై మద్యం తీసుకువస్తున్న రామ్మోహన్, రాజు అనే వ్యక్తులను పత్తికొండ బైపాస్‌లో అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 20 మద్యం అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని ద్విచక్రవాహనం సీజ్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. కాగా నిందితుల్లో ఒకరు కర్నూలు ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. హర్యానా నుంచి అక్రమ మద్యం పత్తికొండకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

సైకో పాలనకు చరమగీతం పాడుదాం

కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), మార్చి 15: సార్వత్రిక ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి సైకో పాలనకు చరమగీతం పాడుదామని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు అర్బన్ మండలం గీతాముఖర్జీనగర్‌లో శుక్రవారం బొగ్గుల దస్తగిరి సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. గీతా ముఖర్జీనగ్, సమతానగర్, సంతోష్‌నగర్, తదితర ప్రాంతాల్లో కొంతమంది వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడపడితే అక్కడ భూకబ్జాలు చేశారని మళ్లీ వైసీపీకి ఓటు వేస్తే ఉన్న ఇంటిని ఆస్తులను లాగేసుకుంటారని ఆయన ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బంటి, సుభాన్, వెంకటేశ్వర్లు, ఇలియాస్, దర్గాబాషా, నియాజ్, మహబూబ్, సూరి, చాంద్, షేక్ష, మక్బుల్, పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఓర్వకల్లు, మార్చి 15: మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో ఓంకార్ యాదవ్ శుక్రవారం తెలిపారు. ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 260 మంది విద్యార్థులు పరీక్షలకు రాయనున్నారు. ఈ పరీక్ష కేంద్రంలో చీఫ్‌గా రామచంద్రారెడ్డి, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా సింగోటం, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 320 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా.. ఈ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంటుగా శేషాచలం, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా హుశేన్‌వలి, బాలభారతి పాఠశాల పరీక్ష కేంద్రంలో 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా.. ఆ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంటుగా విజయ భాస్కర్, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా వాసుదేవలు, లొద్దిపల్లె పరీక్ష కేంద్రంలో 350 మంది పరీక్షలు రాయనుండగా.. ఆ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంటుగా లిల్లీ పుష్పరాణి, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా మల్లికా ర్జున, ఏపీఆర్ కాల్వబుగ్గ పరీక్ష కేంద్రంలో 350 మంది పరీక్షలకు హాజరు కానుండగా.. ఈ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంటుగా శేఖర్, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా శివప్రసాద్ వ్యవహరించనున్నారు. ఈ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ నటరాజ్ తెలిపారు.

రేపు సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 15: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య హాజరవుతున్నారన్నారు.

నగరంలో సమ్మర్ ఎగ్జిబిషన్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 15: నగరంలో సమ్మర్ ఎగ్జిబిషన్ వచ్చేసింది. వేసవిలో మూడు నెలల పాటు చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదం కనువిందు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల వేళ కాస్త ఉపశమనం పొందేందుకు ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసే గేమ్‌షోలు, పరికరాలు, దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి.

టీడీపీతోనే దళితుల అభివృద్ధి



జోహరాపురంలో పర్యటిస్తున్న దళిత జేఏసీ నాయకులు

కర్నూలు(అర్బన్), మార్చి 15: తెలుగుదేశం పార్టీతోనే దళితులు అభివృద్ధి చెందుతారని జేఏసీ చైర్మన్ బొల్లెద్దుల రామకృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని జోహరాపురంలో దళిత చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ కే.పద్మలతారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు, బూతు ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, టీడీపీ సీనియరు నాయకులు, దళిత జేఏసీ సభ్యులు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా బొల్లెద్దుల రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళితులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు.

రేపు ఎస్ఎల్‌టీఏ సంతాప సభ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 15: స్థానిక ఐఎఎస్ఈ (సిల్వర్ జూబ్లీ కళాశాల)లో ఎస్ఎల్‌టీఏ ఆధ్వర్యంలో ఈనెల 17న డాక్టర్ జయరామ్ సంతాప సభను ఏర్పాటు చేసినట్లు ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మద్దిలేటి, జిల్లా అధ్యక్షుడు తాహేర్ ముపేస్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ శుక్రవారం తెలిపారు. జయరాం ఎస్ఎల్‌టీఏకి ఎనలేని సేవలు అందించారని, గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారని, ఆయనను స్మరిం చుకుంటూ ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డి, ఆర్థిక కార్యదర్శి గంగాధర్ హాజరవుతున్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు మార్చి 15: గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని 33 కేవీ గూడూరు, లద్దగిరి ఫీడర్లకు మరమ్మతులు చేపట్టనుండగా, అలాగే 132/33 కేవీ గూడూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనుండగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గూడూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ/ఆపరేషన్ జేసన్, ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. అలాగే కోడుమూరు మండలంలోని కోడు మూరు, లద్దగిరి, గూడూరు మండలంలోని గూడూరు, కె.నాగలాపురం, సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, సి.బెళగల్ 33/11 కేవీ సబ్ స్టేషన్లలో మేయింటెనెన్సు చేపట్టనుండగా విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రేపు జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 15: కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లోని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17న జిల్లా రెజ్లింగ్ జట్లను ఎంపిక చేయ నున్నట్లు రెజ్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్, కార్యదర్శి అబ్రహం లింకన్ శుక్రవారం తెలిపారు. క్రీడాకారుల వయస్సు 2004, 2005, 2006 సంవత్సరాలలో జన్మించిన వారై ఉండాలన్నారు. అండర్-20 విభాగంలో బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్ కాపీలను వెంట తీసుకుని ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని, వివరాలకు 8099804318ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కోడుమూరు(రూరల్), మార్చి 15: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. శుక్రవారం ప్యాలకుర్తి, పులకుర్తి, కోడుమూరులో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడవద్దని అన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కేంద్రబలగా లతోపాటు ఎస్ఐలు బాలనరసిం హులు, హనుమంతయ్య, తిమ్మారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

» టీడీపీ అభ్యర్థి టీజీ భరత్
» వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన యువకులు

కర్నూలు(అర్బన్), మార్చి 15: వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని 44 వార్డు సీతారాంనగర్‌లో వైసీపీకి చెందిన యువకులు సుబ్బు, షణ్ముక, సాయి, నవీన్, ప్రదీప్‌లు టీడీపీ నాయకులు దేవా, మనోజ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి టీజీ భరత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతుందని, ప్రతి ఒక్కరూ ఓటు వేసి తర్వాత సమస్యల పట్ల నాయకులను నిలదీయాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిబాబు, రమేష్, శ్రీధర్, ప్రభాకర్, క్రిష్ణవేణి, జ్యోతి, సుబ్రహ్మణ్యం, సురేంద్రరెడ్డి, లోకేష్, బూత్ ఇన్‌చార్జిలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

● టీజీ భరత్ సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శం టీజీ భరత్ చేసే సేవా కార్యక్రమాలు తమకు ఆదర్శమని పార్టీలో చేరిన యువకుడు సుబ్బు తెలిపారు. రాజకీయంగా ఎలాంటి అధికారిక పదవీ లేకపోయినా ప్రజలకు ఏదో విధంగా సేవ చేస్తున్నారని టీజీ భరత్‌ను కొనియాడారు. పదవీలో ఉంటే కర్నూలును ఎంతో అభివృద్ధి చేస్తారన్న నమ్మకం యువతకు ఉందని తెలిపారు.



టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

టీడీపీతోనే భవన నిర్మాణ రంగానికి పూర్వ వైభవం: తెలుగుదేశం పార్టీతోనే భవన నిర్మాణ రంగానికి పూర్వ వైభవం వస్తుందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని మౌర్యఇన్‌లో 11 వార్డుకు చెందిన యువకులు హైదర్ హుసేన్, ఫిరోజ్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో గౌండ పనులు, సెంట్రింగ్ పనులు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ వస్తే ఉచిత ఇసుక విధానం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఇమ్రాన్, ఇంజార్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రజకులకు న్యాయం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



రజక సాధికార కమిటీ సమావేశంలో బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), మార్చి 15: చంద్రబాబుతోనే రజక సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గల్లా మాధవికి సీటు కేటాయింపు పట్ల రజక సంఘాల నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి రామారావు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ కూడా రజకులకు ఇంతటి గౌరవం ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమానికి రజక సాధికార కమిటీ సభ్యుడు సీపీ వెంక టేష్, కన్వీనర్ మాలంగిరి గణేష్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సి.చంద్ర శేఖర్, జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు షేక్ ముంతాజ్, విజయలక్ష్మి, రేణుకా, నీలావతి, బీసీ రాష్ట్ర నాయకుడు నాగేశ్వరరావు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు హనుమం తరావు చౌదరి, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ జూనియర్ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు



స్కిల్ హబ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కమిషనర్ సౌరబ్‌గౌర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 15: స్థానిక బీక్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సౌరబ్‌గౌర్ పరిశీలించారు. కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసినందుకు ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను కమిషనర్ అభినందించారు. అనంతరం స్కిల్‌హబ్ పోస్టర్‌ను విడుదల చేశారు. కడప ఆర్జేడీ రవినాయక్, డీవీఈవో జమీర్‌ఫాషా, ఆర్ఐవో గురువయ్యశెట్టి, ప్రిన్సిపాళ్లు నాగస్వామి నాయక్, సుంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా గోదా రంగనాథ స్వామి కల్యాణం

కర్నూలు(కల్చరల్), మార్చి 15: శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి వారి కల్యాణ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. నగర శివారులోని గోదా రంగనాథ స్వామి దేవస్థాన ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు శుక్రవారం స్వామి వార్ల కల్యాణ వేడుకలను వైభవం గా నిర్వహించారు. పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామి, ప్రయాగ రాజ్ నుంచి విచ్చేసిన ప్రయాగ రాజ్ రాఘవ ప్రపన్న జీయర్ స్వామి, పరమాత్మనందగిరి స్వామి పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి హనుమద్వాహన సేవ, సాయంత్రం గరుడ వాహన సేవలు నిర్వహించారు.

అలరించిన సంగీత విభావరి: స్వామి వారి కల్యాణ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తనా విభావరి భక్తులను అలరింపజేసింది. టి. సాయిరాం గాత్రానికి ఎం. బాలస్వామి, వై రమణలు వాయిద్య సహకారాలు అందించారు.



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

భక్తిశ్రద్ధలతో కిస్తీలు



దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, మార్చి 15: మండల కేంద్రంలో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమ్మూద్ షాఖాద్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కిస్తీలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీటిని తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి గురువులు ఎస్ఎండీ నజరుల్లా షాఖాద్రి, ఎస్ఎండీ షఫిఉల్లా షాఖాద్రిలు పూజలు చేశారు. భక్తులు స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నా వార్డుకు ఏం చేశారు.. ?

వైసీపీ సీనియర్ నాయకురాలు జమీలా ఆవేదన

కర్నూలు(న్యూసిటీ), మార్చి 15: నగరంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 22వ వార్డుకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని వైసీపీ సీనియర్ నాయకురాలు జమీలా బేగం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ అధ్యక్షతన జరిగిన కార్పొరేటర్లు, ఇన్‌చార్జిల సమావేశంలో జమీలా బేగం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తనకు ఎలాంటి పదవి ఇవ్వలేదని ఆక్రోశం వెల్లగక్కారు. ప్రస్తుతం 22వ వార్డు కార్పొరేటర్ టీడీపీలో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇన్నాళ్లు పార్టీని నమ్ముకున్న తనకు ఏమి చేశారని ఇంతియాజ్‌ను ప్రశ్నించారు. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది. మధ్యలో ఇంతియాజ్ కలుగజేసుకుని న్యాయం చేస్తామని వైసీపీ అధిష్ఠానం హామీ ఇచ్చిందని, ఓర్పుతో ఉండాలని సముదాయించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కర్నూలు(కల్చరల్), మార్చి 15: కర్నూలుకు చెందిన (ప్రస్తుత విశాఖపట్నం ఆర్డీవో) హుస్సేన్ సాహెబ్ అందజేసిన ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులను ఉపవాసం పాటిస్తున్న నిరుపేద ముస్లిం మహిళలకు శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత చేతుల మీదుగా ఐదు రకాల వస్తువులను అందజేశారు.

వేసవి శిబిరాల నిర్వహణకు ఆహ్వానం

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 14: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పరిధిలోని గ్రామ, పట్టణాల్లో వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణకు శిక్షకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణా శిబిరం మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు 6 వారాల ఎన్ఐ ఎస్ సర్టిఫికెట్ కోర్సు, పీఈటీలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయండి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 15: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తోందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిసిపోయాయని, ఎక్కడ చూసినా కరువు విలయతాండవం చేస్తోందని, అందువల్ల వలసలను నివారించేందుకు 200 రోజులు తగ్గకుండా ఉపాధిని పెంచాలని అన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కోడుమూరు(రూరల్), మార్చి 15: వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. మండలంలోని గోరంట్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన సందర్శిం చారు. వైద్యపరీక్షలను పరిశీలించి రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు దేవేంద్రప్రసాద్, శృతి, జయంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, సీహెచ్‌వో శాంత, సూపర్‌వైజర్ శారద, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో పారిశుధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 15: నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని కమిషనర్ ఏ.భార్గవతేజ ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం ట్రేడ్ లైసెన్సు, యూజర్ చార్జీ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావే శంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, సెక్రటరీ నాగరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాసులు, మునిస్వామి, ముర్తుజావలి, రమేష్‌బాబు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

ఓర్వకల్లు, మార్చి 15: ఓర్వకల్లులో హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమ్మూద్ షాఖాద్రి ఉరుసు సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ప్రథమ విజేతగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం టీమ్ సభ్యులు గెలుపొందగా రూ.15వేల నగదును దాత శంకర్ రెడ్డి అందజేశారు. ద్వితీయ విజేతగా ఓర్వకల్లు మండలం శకునాల జట్టు నిలిచి రూ.10వేల నగదును దాత లక్ష్మికాంతరెడ్డి, అన్వర్‌బాషాలు అందజేశారు. తృతీయ విజేతగా ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గ గెలుపొందగా.. రూ.5 వేల నగదును దాత జడ్పీటీసీ సభ్యుడు రంగనాథగౌడు అందజేశారు. నాలుగో విజేతగా పారుమంచాల జట్టు నిలిచి రూ.3వేల నగదును దాత టీడీపీ మం డల కన్వీనర్ గోవిందరెడ్డి అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జోసఫ్, జాకీర్ హుశేన్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో గురువులు ఎస్ ఎండీ నజరుల్లా షాఖాద్రి, ఎస్ఎండీ షఫిఉల్లా షాఖాద్రి, కురువ పెద్దయ్య, రోళ్లపాడు మద్దిలేటి, శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి అల్లాబాబు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతగా కర్నూలు టీజీ క్లబ్

ఓర్వకల్లు, మార్చి 15: ఓర్వకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమ్మూద్ షాఖాద్రి ఉరుసు ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వాలీ బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా కర్నూలు టీజీ క్లబ్ నిలిచి రూ.5వేల నగదును దాత టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గుట్ట పాడు సర్పంచ్ మోహన్ రెడ్డి అందజేశారు. రెండో విజేతగా ఓర్వకల్లు వలి జట్టు నిలిచి రూ.3వేల నగదును దాత బుగ్గ రామేశ్వర డిగ్రీ కళాశాల అంద జేసింది. మూడో విజేతగా కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల టీమ్ గెలుపొందగా రూ.2వేల నగదును టీడీపీ బీసీ సెల్ కన్వీనర్ అల్లాబాబు నగ దును అందజేశారు. నాలుగో విజేతగా ఓర్వకల్లు గ్రౌండు టీమ్ నిలిచి రూ.100 0 నగదును దాత రంగలక్ష్మమ్మ అందజేశారు. ఆర్గనైజర్లుగా ఇంతియాజ్, ఖలీల్, చంద్రపాల్ వ్యవహరించారు. కార్యక్రమంలో గురువులు ఎస్ఎండీ నజరుల్లా షాఖాద్రి, ఎస్ఎండీ షఫీవుల్లా షాఖాద్రి పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 15: గిరిజనుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, కార్యదర్శి విష్ణునాయక్ అన్నారు. శుక్రవారం టీఎస్ఎఫ్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. దాదాపు 20 గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి గిరిజన సంక్షేమానికి వైసీపీ తూట్లు పొడిచిందన్నారు. టీఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పళ్లల రాజ్‌కు మార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు డి.వెంకటేశ్వర్లు నాయక్, విజయ్ నాయక్, బద్దు నాయక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 15: రాష్ట్రంలోని వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టీ ప్రయోజనాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాల్మీకి నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో వాల్మీకుల ఎస్టీ బిల్లును ఆమోదించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని ప్రసాద్, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, బెంగళూరు రంగ నాయకులు పాల్గొన్నారు.

సీఏఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 15: పౌరసత్వ సవరణ చట్టంను (సీఏఏ) బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జమ్మిచెట్టు నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ సీఏఏను ప్రజా పోరాటాలతో ఐదేళ్లు మూలనబెట్టి ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండగా అమలు చేసే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే బీజేపీ ఆడుతున్న నాటకమని అన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, అబ్దుల్లా, రంగప్ప, సుభాన్, షరీఫ్ పాల్గొన్నారు.

నకిలీల బారి నుంచి రైతుల్ని కాపాడండి

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం



జేడీకి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 15: నకిలీ విత్తనాలు, పురుగు మందుల వల్ల రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేడీ కార్యాలయంలో ఎమ్మిగనూరులో త్రివేణి, ఆగ్రో ఎంటర్‌ప్రైజెస్ దుకాణాన్ని వెంటనే సీజ్ చేసి నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు అమ్మేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ ఆయన జేడీ వరలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఎమ్మిగనూరులోని త్రివేణి ఆగ్రో ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో డీలర్ రైతులను నిలువుదోపిడీ చేస్తూ కాలం చెల్లిన క్రిమిసంహారక మందులను విక్రయిస్తున్నాడని తెలిపారు. ఈ డీలర్ వద్ద కాల్డాన్-50 ఎస్‌పీ రకం కాలం చెల్లిన మందును వాడటం వల్ల పంట దెబ్బతిని రైతులు నష్టపోయారని, వెంటనే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకోవాలి: డీఎస్పీ



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీఎస్పీ డీఎస్పీ తదితరులు

కర్నూలు(కల్చరల్), మార్చి 15: ప్రతి ఒక్కరూ వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీఎస్పీ క్యాంపు ఆవరణ లోని సీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్లను లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ వస్తువులు, ఇతర సేవల్లో నాణ్యత, స్వచ్ఛత సమాచారం పొందే హక్కు వినియోగదారులకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ఎం పాఠశాల హెచ్ఎం టి.వెంకటరెడ్డి, పాఠశాల అభి వృద్ధి కమిటీ సభ్యులు యశోదమ్మ, కరీం, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు
● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

నేనేం తప్పు చేశాను?

● మంత్రాలయం టికెట్ వైసీపీ కోవర్టుకు ఇవ్వడం సరికాదు
● విస్తృత స్థాయి సమావేశంలో తిక్కారెడ్డి ఆవేదన

మంత్రాలయం, మార్చి 15: తానేం తప్పు చేశానని, మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ టికెట్ వైసీపీ ఎమ్మెల్యే కోవర్టుగా ఉన్న రాఘవేంద్ర రెడ్డికి కేటాయించారని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మంత్రాలయం మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ నివాసం వద్ద నియోజకవర్గంలో నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, బాలక్రిష్ణ అభిమానులతో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ తాము ఏమి తప్పు చేశామని టికెట్ ఇవ్వలేదో అధినేత చంద్రబాబు, నారా లోకేశ్ పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చే శారు. టీడీపీ టికెట్ రాఘవేంద్రరెడ్డికి ఖరారైన విషయం వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మూడు నెలల కిందటే ప్రకటించారని, దీనికి సంబంధించిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని ఆయన అన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోవర్టుకు టికెట్ కేటాయిస్తే.. ప్రజల్లోకి ఏవిధంగా ఓటు అడగాలని అన్నారు. తాను టీడీపీని, చంద్రబాబు, నారా లోకేశ్‌ను నమ్మానని, ఇప్పటికైనా వారు పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. చంద్రబాబు, లోకేశ్‌ల చుట్టూ తిరిగిన బ్రోకర్లు, వైసీపీ ఎమ్మెల్యే కోవర్టులు చెప్పిన మాటలతోనే మంత్రాలయం టీడీపీ టికెట్ తనకు రాలేదన్నారు. రాష్ట్రంలో వేరే నియోజకవర్గాల్లోల్లాగా టీడీపీని దూషించవద్దని, డౌన్ డౌన్ అనవద్దని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా ప్రాణాలకు తెగించి టీడీపీ నాయకులను, కార్యకర్తలను కాపాడుకుంటూ మంత్రాలయాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మార్చానని తెలియజేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన డబ్బుతో కోవర్టుల పనివల్లే మంత్రాలయం నియోజకవర్గంలో ఏ నాయకుడికీ తెలియకుండా టికెట్ ప్రకటించారని అన్నారు. వైసీపీ కోవర్టుకు టికెట్ ఇస్తే.. సహకరించేది లేదని తేల్చి చెప్పారు. గత ఎన్నికల్లో తన కాలిలో బులెట్ దిగినా బాధపడలేదు కానీ.. ఈరోజు టీడీపీ టికెట్ తనకు దక్కకుండా చేసిన వారెవరో ఆధారాలతో సహా నిరూపిస్తానని ఆయన అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, నాయకులు నరవ రమాకాంత్‌రెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, ఎల్లారెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డి, వెంకటపతిరాజు, చెన్నబసప్ప, అడివప్పగౌడు, శివమోహన్ రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, జ్ఞానేష్, సోల్మాన్‌రాజు, మాలపల్లి చంద్ర, వగరూరు అబ్దుల్లా, యేబు, రాజబాబు, దేవన్న, పెద్ద ఎత్తున నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిక్కారెడ్డి



మంత్రాలయంలో టైరును దహనం చేస్తున్న టీడీపీ నాయకులు, తిక్కారెడ్డి అభిమానులు

మంత్రాలయంలో పెద్దఎత్తున నిరసన:

మంత్రాలయం టీడీపీ టికెట్ వైసీపీ కోవర్టుగా ఉన్న రాఘవేంద్రరెడ్డికి ఇవ్వడం ఏమిటని తిక్కారెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. రాఘవేంద్రసర్కిల్‌లో టైర్లను దహనం చేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. శుక్రవారం మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ ఇంటి నుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, పన్నగ వెంకటేశ్, నరవ రమాకాంత్ రెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్రరెడ్డికే కేటాయిస్తే.. మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని వారు అన్నారు.

హడావుడిగా కౌన్సిల్ అత్యవసర సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు

ఆదోని టౌన్, మార్చి 15 : మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం చైర్ పర్సన్ బోయ శాంత అధ్యక్షతన హడావుడిగా నిర్వహించారు. ఈనెల 7వ తేదీన సాధారణ సమావేశంతో పాటు, అత్యవసర సమావేశం కూడా నిర్వహించిన అధికారులు, 8 రోజుల వ్యవధిలోనే మరొక అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమావేశంలో అజెండాపై ఎలాంటి చర్చలు జరగలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పారిశుద్ధ విభాగంలో పనిచేస్తున్న రెండు కేటగిరీలలోని కార్మికుల వేతానలను పెంచే అంశాన్ని సమావేశం ఆమోదించింది. దీని ప్రకారం క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్ కేటగిరి-1లో పనిచేస్తున్న పారిశుద్ధ్య విభాగంలోని డ్రైవర్లకు (10మంది) రూ.24500, కేటగిరి-2 కింద పనిచేస్తున్న కార్మికులకు (168 మంది) రు.21,000 చొప్పున ఈనెల నుండి వేతనాలు పెరగనున్నాయి. చాలామంది కౌన్సిల్ సభ్యులు గైర్హాజరయ్యారు. సమావేశంలో కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఎమ్‌ఈ వెంకట చలపతి, అసిస్టెంట్ సీటీ ప్లానర్ శ్రీనివాసులు, సానిటరీ ఇన్స్పెక్టర్ హరినాథ్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

ఆదోని టౌన్, మార్చి 15 : జగద్గురువు రేణాకాచార్యుల జయంతి మహోత్సవం ఈనెల 22న నిర్వహిస్తున్నామని, ఆరోజు రాష్ట్ర ప్రభుత్వం ఆరోజు సెలవు దినంగా ప్రకటించాలని జిల్లా జంగమ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎమ్ ఎర్రిస్వామి, ఆదోని డివిజన్ అధ్యక్షుడు పరుషోత్తం స్వామి కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆ రోజును సెలవు దినంగా అధికారికంగా ప్రకటించిందని, అదే రీతిలో ఆంధ్ర రాష్ట్రంలో కూడా సెలవును ప్రకటించి వీరశైవ, జంగమ సామజిక వర్గ ప్రజలకు సహకరించాలని కోరారు.

ఉచిత కంటి పరీక్షలు

ఆదోని టౌన్, మార్చి 15 : పట్టణ పొలిమేరలోని జీవనజ్యోతి ఆశ్రమంలో శుక్రవారం ప్రపంచ నీటి శుక్లాల వారోత్సవం సందర్భంగా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు, అనాధలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు వివిధ కంటి పరీక్షలను నిర్వహించారు. కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ కంటి శుక్లాలతో చూపు మందగించడంపై, సరైన సమయంలో స్పందించకుంటే చూపుకోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఆశ్రమంలోని 40 మందికి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందజేశారు. ఆశ్రమ నిర్వహకుడు విక్టర్ పాల్ ఫిలిప్స్ పాల్గొన్నారు

విద్యతోనే ఏదైనా సాధించవచ్చు

పత్తికొండ టౌన్, మార్చి 15: విద్యలో రాణించేవారు దేనిలోనైనా ఉన్నత స్థానం సాధిస్తారని, విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని సీఐ మురళి మోహన్ సూచించారు. శుక్రవారం పందికోన గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అగస్టన్, ఏఐవైఎఫ్ తాలుకా అధ్యక్షులు పెద్దయ్య, నాయకులు రవి, చిరంజీవి, వెంకటేశ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బడేసాహెబ్ స్వామికి ప్రత్యేక ప్రార్థనలు



బడేసాబ్ స్వామి జీవ సమాధిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, మార్చి 15: గంజహళ్లి గ్రామంలో వెలసిన మహత్మబడే సాహెబ్ స్వామి వారి జీవ సమాధిని శుక్రవారం స్వామి వారి ఉరుసు (గంధం) సందర్భంగా సందర్శించి ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు అలాగే టీడీపీ నాయకుడు మాచాని సోమనాథ్, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, జిల్లా టీడీపీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి పరమేశ్వరరెడ్డి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామివారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కౌలుట్లయ్యనాయుడు, దరగలమాబు, చెన్నలరాయుడు, పెద్దలక్ష్మన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

ఎమ్మిగనూరుటౌన్ , మార్చి 15: పట్టణంలోని 11వ వార్డులో రూ.11 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణపనులకు వైసీపీ సమన్వయ కర్త బుట్టా రేణుక, వైసీపీ సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డిలు శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వైస్‌చైర్మన్ నజీర్, నాయకులు బుట్టా రంగయ్య, రాజు, రియాజ్, డీఈ మనోహర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఎలాంటి ప్రభుత్వ హోదాలేని బుట్టా రేణుక పట్టణంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేయటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గిరక బండ్ల విజేతలకు నగదు అందజేత



విజేతల రైతులకు నగదును అందిస్తున్న టీడీపీ నాయకులు

కౌతాళం, మార్చి 15: కౌతాళంలో గ్రామ దేవత మారికాంబదేవి దేవర సందర్భంగా నిర్వహించిన ఎద్దుల బండ్ల గిరక పోటీలలో గెలుపొందిన వారికి శుక్రవారం గ్రామ టీడీపీ నాయకులు నగదు బహుమతులను అందజేశారు. మొదటి విజేత జుమాలదిన్నె గాదిలింగప్పకు రూ.25వేలు, రెండో విజేత కబాడి హరిష్‌కు రూ.20వేలు, మూడో బహుమతి బాపురం ఉసేనికు రూ.15వేలు, నాలుగో బహుమతి ఉరుకుంద ఎల్లప్పకు రూ.10వేలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, మంజునాథ, సిద్దు, నిర్వాహకులు పింజారి బాబు, మూకన్న, ఉసేనిలు ఉన్నారు.

ముగిసిన ఉత్సవాలు

ఆస్పరి, మార్చి 15 : మండలంలోని తొగలగల్లు గ్రామంలో వెలిసిన భూమినీలా చెంచులక్ష్మి ఓబులేసు స్వామి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయని గ్రామ సర్పంచ్ అంజనేయులు యాదవ్ తెలిపారు. ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిమందిగా తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి శాంతి హోమాలు

మద్దికెర, మార్చి 15: మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో వైభవంగా శాంతి హో మాలు నిర్వహించారు. శుక్రవారం షష్టిలో భాగంగా మూలవిరాట్ సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పురోహితుల ఆధ్వర్యంలో శాంతి హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ యాదవ్, తదితరులు ఉన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి



హనవాళ్ గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్, మార్చి 15 : గ్రామాల్లో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కేంద్ర పోలీస్ బలగాలు, పెద్దతుంబళం ఎస్‌ఐ పీరయ్య, ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి జి.హొసళ్ళి, కడితోట, హనవాళ్ గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు.

క్రిష్ణగిరి, మార్చి 15: మండలంలోని ఆలంకొండ,కటారుకొండ,కోయిలకొండ,చిట్యాల,మంచు ఎర్రగుడి,కంబాలపాడు గ్రామాలలో శుక్రవారం సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో పోలీస్‌లు కవాతు నిర్వహించారు.సీఐ సుధీర్ కుమార్ రెడ్డి,ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు,సీఆర్పీఎఫ్ బలగాలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి



ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులుకు సమస్యను వివరిస్తున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూర్ కిషోర్

ఆలూరు, మార్చి 15 : ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులలో బాగంగా నిర్మిస్తున్న ప్రహరీ వల్ల పరిసరాల్లో ఉన్న కాలనీ ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని కాలనీవాసులు ఇచ్చిన వినతి మేరకు శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ రిజినల్ మేనేజర్ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూర్ కిషోర్, తెలుగు యువత జిల్లా నాయకులు సురేంద్ర, మాజీ టీడీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి 150 కుటుంబాలు బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్నారని, రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రహరిని నిర్మించాలని కోరారు. ఉన్నత అధికార్ల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

● ఉత్సాహంగా ఇంటి బాట పట్టిన విద్యార్థులు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 15 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు శుక్రవారం ముగిశాయి. రెండో ఏడాది ఇంటర్ విద్యార్థులు ఏడాది పాటు పరీక్షల కోసం సిద్ధపడి పరీక్షలు రాశారు. పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులంతా పరీక్షా కేంద్రాల నుండి బయటికి రావడంతో కేరింతలు, సంతోషం, ఉత్సాహంతో ఇంటి బాట పట్టారు. పరీక్షా ఫలితాలపై ఉత్తీర్ణత సాధిస్తామని విద్యార్థులు కొంతమంది ధీమా వ్యక్తం చేశారు. ఇక కొద్ది రోజులు చదువులు పక్కనపెట్టి కుటుంబసభ్యులతో బంధువులతో సంతోషంగా గడిపి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకుంటామని విద్యార్థులు పేర్కొన్నారు. మరి కొంతమంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో ఎంసెట్, నీట్, అగ్రిసెట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధపడటం కోసం కోచింగ్‌కి వెళ్తామని తెలిపారు. ఇక టాటా...బాయ్...బాయ్... అంటూ వీడ్కోలు పలుకుతూ ఇంటికి వెళ్లారు.

కేంద్ర ప్రభుత్వం సీఏఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



ఎమ్మిగనూరులో సీఏఏకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 15: దేశంలో మతపరమైన విభజన సృష్టించి రాజకీయ లబ్ది పొందేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు రంగన్న, భాస్కర్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఏఏకు వ్యతిరేకంగా పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం సీఏఏ చట్టం అమలు చేస్తే దేశంలో మతపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈచట్టం ద్వారా ప్రజల్లో ఐక్యత దెబ్బతింటుందన్నారు. ఈచట్టాన్ని అమలు చేయకుండా అన్ని రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలన్నారు. చట్టం అమలు చేస్తే బీజేపీని, ఆ పార్టీని బలపరుస్తున్న మిత్రపక్షాలను ఓడించాలన్నారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ కమిటీ నాయకులు కేజీ జబ్బార్, ఖాజా, సమీర్, ముక్తార్, మాలిక్, సీపీఐ నాయకులు తిమ్మగురుడు, రాజీవ్, దాదావలి, మల్లికార్జునగౌడు, సుంకన్న, నరసింహులు, హనుమంతు, జయరాం, రాము, వీరేంద్ర, వీరేష్, గోపాల్, మహేంద్ర పాల్గొన్నారు.

సమయానికి రాని విద్యార్థి బస్సు

● పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన విద్యార్థులు



పోలీస్‌స్టేషన్ ముందు ఉన్న విద్యార్థులు

హొళగుంద, మార్చి 15 : హొళగుందలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు సమ్మతగేరి, సులువాయి, ముగ్గుమానుగుంది, పెద్దహ్యాట్టకు చెందిన విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరంత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యార్థి బస్సులో ప్రయాణిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలైన విద్యార్థి బస్సు రాకపోవడంతో విద్యార్థులంతా కలిసి పోలీసులను ఆశ్రయంచారు. స్పందించిన పోలీసులు ఓ ప్రైవేటు వేట్ వాహనాన్ని ఏర్పాటు చేసి, విద్యార్థులను వారి గ్రామాలకు తరలించారు. ఈ విషయం పై ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీని వివరణ కోరగా, ప్రతి రోజు విద్యార్థి బస్సులు తిరుగుతున్నాయన్నారు. ఈరోజు రాకపోవడంపై విచారణ చేసి, మరోసారి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూస్తామని తెలిపారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం

హొళగుంద, మార్చి 15 : హొళగుందలోని దళిత కాలనీకి చెందిన దివ్యాంగుడు ఈశ్వర్‌కు జనసేన పార్టీ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేసినట్లు జనసేన హొళగుంద మండల అధ్యక్షుడు అశోక్, భాగోడి శీను శుక్రవారం తెలిపారు. సంవత్సరం క్రితం బళ్ళారి రైల్వే స్టేషన్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఈశ్వర్‌కు ఒక చేయి, రెండు కాళ్లు తొలగించారు. వెంకప్ప ఆర్థికంగా ఇబ్బంది పడుతండంతో విషయం తెలుసుకొని జనసేన నాయకులు ఆర్థిక చేశారు. కార్యక్రమంలో దినేష్, చిన్న, మంజు, రాజు పాల్గొన్నారు.

ప్రకాష్ జైన్‌కు అసెంబ్లీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న జైన్ సంఘ పెద్దలు

ఆదోని టౌన్, మార్చి 15 : బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఆదోని అసెంబ్లీ స్థానం బీజేపీకు కేటాయించడం ఎంతో సంతోషంగా ఉందని, బీజేపీ పార్టీ తరపున పోటీ చేయడానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీలో సీనియర్ లీడర్‌గా ఉన్న ప్రకాష్ జైన్‌కు అవకాశం కల్పించాలని జైన్ సంఘ్ పెద్దలు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం హంసజీపేటలోని జైన్ మందిర్‌లో జరిగిన సమావేశంలో సంఘ్ పెద్దలు మాట్లాడుతూ ప్రకాష్ జైన్‌కు బీజేపీ తరపున పోటీ చేయడానికి అవకాశం కల్పిస్తే గెలిపించుకొనే బాధ్యత తీసుకుంటామన్నారు. సమావేశంలో పెద్దలు నరేంద్ర కుమార్, లీలాచంద్ జైన్, ప్రేమ్ కుమార్, దీపక్ రాథోడ్, దీపక్ ధోకా, నరేష్ జైన్, దయాల్ జైన్ పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక



వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 15: మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. శుక్రవారం మాధవరంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 20 వైసీపీ కుటుంబాలు దండు నరసింహులు, వెంకన్న, కరెంటు రాముడు, తిక్కన్న, బుజ్జుల గోవిందు, నగేష్, మాబాషా, హనుమంతు, వీరారెడ్డి, మద్దిలేటి, ఈరన్న, ధర్మయ్య, జొల్లన్న, గోవిందు తదితరులకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి



వ్యవసాయ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

దేవనకొండ, మార్చి 15 : పంటనష్ట పరిహారం వెంటనే రైతుల ఖాతాలకు జమచేయాలని ఏపీ రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుసంఘం మండల అద్యక్ష, కార్యదర్శులు కండప్ప, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షాలు లేకపోవడంతో ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించిందే కానీ రైతుల ఖాతాలకు ఇంతవరకైన కూడా నిధులు జమ చేయలేదన్నారు. రైతు ఖాతాలకు నిధులు జమ చేయాలన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్యాలయం అధికారులకు నాయకులు వినతి పత్రం అందజేశారు. పత్రం అందజేశారు. వీరస్వామి, బాషా, మద్దిలేట్టి, మధు, కోదండ, నకసన్న, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం



మద్దికెరలో భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, మార్చి 15: ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ప్రణాళిక లేకుండా సాగించిన పాలనతో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని, అభివృద్ధి కుంటు పడిందని పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, మండల తెలుగు యువత అధ్యక్షులు ఎస్.ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దికెరలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయినగర్‌బాషా, బొల్లాపురం చంద్ర, ఆవుల నాగరాజు, తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి



పెండేకల్‌లో టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, మార్చి 15: టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని మాజీ సర్పంచ్ బర్మ వీరేష్, మాజీ ఎంపీటీసీ వెంకట్రాముడు గౌడులు అన్నారు. శుక్రవారం మండలంలోని పెండేకల్, మారెళ్లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమలో భాగంగా ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నాయుడు, మల్లికార్జున, రాజశేఖర్, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి శవ రాజకీయాలు

దేవనకొండ, మార్చి15 : వైసీపీవి శవ రాజకీయలని ఐటీడీపీ మండల కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెనాలిలో గీతాంజలి మృతిని అసత్య ప్రచారాలతో రాజకీయాలకు వాడుకోవడం దారుణమన్నారు. ప్రజలు వైసీపీకి బుద్ధి చేప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం పాకెట్లను ధ్వంసం చేస్తున్న లారీ

పత్తికొండ, మార్చి 15 : వివిధకేసులలో పట్టుబడిన అక్రమమద్యాన్ని శుక్రవారం జిల్లా అసిస్టెంట్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, పత్తికొండ సెబ్ సీఐ సువర్ణలతల సమక్షంలో సెబ్‌సిబ్బంది ధ్వంసంచేశారు. వారు మాట్లాడుతూ అక్రమ మద్యం దాడులసమయంలో స్వాధీనం చేసుకున్న నాటుసారా, తెలంగాణ కర్ణాటక మద్యంను నిబంధనమేరకు ధ్వంసం చేస్తున్నామన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మద్దికెర, మార్చి 15: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వేసవి కాలం ఆరంభమైందని, దోమల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏదైనా వ్యాధులు ప్రబలితే.. వెంటనే వైద్యశాలకు రావాలని తెలిపారు. అనంతరం రోగులను గుర్తించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ఏఎన్‌ఎం గాయత్రీ, తదితరులు ఉన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు



నామినేషన్లు వేస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్ , మార్చి15: ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్‌కు 28న ఎన్నికలు జరుగుతున్నట్లు ఎన్నికల అధికారులు రంగనాథ్, లింగమూర్తి, రాంమూర్తి తెలిపారు. అసోషియేషన్ ప్రసిడెంట్, జనరల్ సెక్రటరీలకు నామినేషన్లు వేశారు. అధ్యక్షస్థానానికి ఎంకే గురురాజరావు, కే వెంకటేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీకి రఘురామ్, తిమ్మప్ప నామినేషన్లు వేశారు. కాగా వైస్‌ప్రసిడెంట్‌గా సుధాకర్, జాయంట్ సెక్రటరీగా గోపాలకృష్ణ, ట్రెజరర్‌గా మురళీకృష్ణ, లైబ్రరీయన్‌గా మహబూబ్‌బాషా, స్పోర్ట్స్ సెక్రటరీగా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 23న నామినేషన్ల విత్‌డ్రా ఉంటుందని తెలిపారు. ఇక పోటీ జరిగే స్థానాలకు 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.